క్లుప్తంగా

టిఫిన్ బాక్స్‌ల అందజేత



రఘునాథపల్లి: మండల కేంద్రంలోని నవ భారతి మండల సమాఖ్య నైబర్ హుడ్ సెంటర్‌లో గురువారం దివ్యాంగులైన చిన్నారుల సమక్షంలో దైతల రాజు–సంధ్య దంపతుల కూతురు రుత్విక పుట్టినరోజు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నైబర్‌హుడ్ సెంటర్‌లోని 30 మంది చిన్నారులకు టిఫిన్ బాక్స్‌లు అందజేసి స్వీట్లు పంపిణీ చేశారు. పిల్లల సమక్షంలో తమ కూతురు జన్మదినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దాతలు దైతల సాయిలు, సంపత్, సీసీలు జంపయ్య, ఎం ఎల్లస్వామి, భాగ్యలక్ష్మి, రేణుక, లలిత పాల్గొన్నారు.

పద్మవిభూషణ్ గ్రహీతలకు సమ్మయ్య అభినందన

దేవరుప్పుల: కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పలు రంగాల్లో విస్తృత సేవలందించిన మహానుభావులకు అందించిన పద్మవిభూషణ్ గ్రహీతలు మెగాస్టార్ చిరంజీవి, విఠలాచారి, వేలుఆనందచారి, ఉమామహేశ్వరలకు పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రముఖ చిందుయక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య అభినందనలు తెలిపారు. మారుమూల ప్రాంతాలకు చెందిన పలు రంగాల సేవకులను గుర్తించి విశిష్ట పురస్కారాలు ఇస్తున్న పీఎం మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములతోపాటు కేంద్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జీఎంఆర్ కాలనీలో చోరీకి యత్నం



జనగామ: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి ప్రయత్నించిన సంఘటన జనగామ పట్టణం జీఎంఆర్ కాలనీలో చోటు చేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కొమురవెల్లి గ్రామానికి చెందిన బచ్చన్నగారి బ్రహ్మయ్య, నాగమణి జీఎంఆర్ కాలనీలో 10 సంవత్సరాలుగా నివాసముంటున్నారు. ఈ నెల7వ తేదీన రాత్రి ఇంటికి తాళాలు వేసి గజ్వేల్‌కు వెళ్లారు. పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులకు ప్రధాన డోర్లు తెరిచి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకుని, వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై భరత్ కుమార్, క్రైం పోలీసులు, వేలిముద్ర నిపుణులు చేరుకుని ఆధారాలను సేకరించారు. మొదటగా వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులు నిర్ధారించుకున్నారు. రెండు గంటల తర్వాత వెండి వస్తువులు ఉన్నట్లు తెలుసుకుని, పోలీసులకు సమాచారం అందించగా ఊపిరి పీల్చుకున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం



జఫర్‌గఢ్: బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాయకులు కోత్వాల కుమార్, తాటికాయల వరుణ్, ఎస్ శ్రీధర్, రమేష్, మాదరాజు సంతోష్, కృష్ణ, స్వామి పాల్గొన్నారు.

చిల్పూరు: సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని పార్టీ మండల కోఆర్డినేటర్ జనగామ యాదగిరి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజన్‌బాబు, గుంటి భీములు, రవీందర్‌రెడ్డి, క్రాంతికుమార్, మోటం రాములు, సుగ్రీవచారి, శాగ వెంకటేశ్వర్లు, గాలి ప్రవీన్, రంగు హరీష్, నారగోని రవిచంద్ర, రచ్చ రవీందర్, బబ్బుల వంశి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వద్ద..

లింగాలఘణపురం: మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీల నాయకులు పోటాపోటీగా కూలీల వద్దకు వెళ్లి ప్రచారం గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు శ్రీలతారెడ్డితో పాటు మాజీ సర్పంచ్ విజయ్‌మనోహర్, ఎంపీటీసీ భిక్షపతి ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేపట్టారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ నాయకులు ఎడ్ల రాజు, కేమిడి వెంకటేశ్, యాదగిరి, వీరయ్య, ఎండీ అబీద్ తదితరులు ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కె. నాగరాజుతో పాటు నాయకులు ఏదునూరి నాగరాజు, వసంత్, యాకేశ్, పరశురాములు, లింగాల ఆదిత్య, వెంకటేశ్ తదితరులు కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కూలీల పని ప్రదేశం వద్దకు వెళ్లి పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

దివ్యాంగులకు రవాణా ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ డీఎస్ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల రోజుదివ్యాంగులు, వృద్ధులను వారి ఇంటి వద్ద నుంచి పోలింగ్ కేంద్రానికి, తిరిగి వారి ఇళ్లకు చేర్చేలా ఐసీడీఎస్ వారు తగిన ఏర్పాట్లు చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఘన్‌పూర్ ఆర్‌డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్లతో గురువారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ రోజున దివ్యాంగులు, వృద్ధులను ఆటోలలో పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ బూత్‌లోకి వీల్‌చైర్లలో తీసుకెళ్లాలని, ఓటు వేసేందుకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఫ్లోరెన్స్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు పెంపు..

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వర్తించనున్న స్థానికేతర ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ఈనెల 10వ తేదీవరకు గడువు పెంచారని ఆర్డీఓ తెలిపారు.

కాంగ్రెస్ పాలనలోనే సమన్యాయం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి

జనగామ: కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాలకు సమన్యాయం దొరుకుతుందని ఆ పార్టీ జనగామ నియోజకవర్గ యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం పెంబర్తి గ్రామంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి తరపున గురువారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. అనంతరం ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో వెలుగులు నింపుతాయన్నారు. ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని భారీ మెజార్టీ తో గెలిపించాలన్నారు. కాగా, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఆవుల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 మంది కాంగ్రెస్‌లో చేరగా, ప్రశాంత్ పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, పీఏసీఎస్ చెర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు బండ్రు సిద్ధులు పాల్గొన్నారు.

'గ్యారంటీ'లతో కాంగ్రెస్‌కు ప్రజాదరణ



బచ్చన్నపేట: ప్రచారం చేస్తున్న కిరణ్‌కుమార్‌గౌడ్



నర్మెట: పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొమ్మూరి

బచ్చన్నపేట: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణ లభిస్తోందని పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని గోపాల్‌నగర్, కొన్నె గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. వెంకట్‌రెడ్డి, ఆగయ్య, సిద్ది నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆలింపూర్, దబ్బగుంటపల్లి, కొన్నె గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమని అన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎలికట్టె శ్రీరాములు, లింగారెడ్డి, శాంతయ్య, అంజయ్య, కుమారస్వామి, కమలమ్మ పలువురు ఉన్నారు. ఎంపీటీసీ మసూద్, సత్యనారాయణ, రాములు, ఆనందం, రమేష్‌రెడ్డి, కవిత, సిద్దిరాములు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నర్మెట: కాంగ్రెతోనే అభివృద్ధి సాధ్యమని దేశంలో ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పలుగ్రామాలలో పార్టీ శ్రేణులతో కలిసి గురువారం ప్రచారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పచేసిందని, బీజేపీ అదానీ, అంబానీలకు దోచిపెట్టిందని కాంగ్రెస్ పాలనతోనే బడుగు బలహీణ వర్గాల అభివృద్ధి సాధ్యమని అన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో ప్రత్యేక తెలంగాణా ఉద్యమకారుడు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కాసెట్టి బాలనర్సింహాతో పాటుగా దన్నారపు శ్రీనివాస్, కందకట్ల సుదర్శన్, దుద్దెడ సంపత్ కాంగ్రెస్ చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, ప్రజ్ఞాపురం శ్రీధర్, చెవ్వల పరశురాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిద్దాం..

పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ బలపరచిన కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని అత్యదిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలకేంద్రంలో ప్రచారం నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. మండల కార్యదర్శి పాతూరి ప్రశాంత్ రెడ్డి, టౌన్ కార్యదర్శి దేవరకొండ పద్మ, సీనియర్ నాయకులు సీతారాం, విజయ, వెంకటయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

భారీ మెజార్టీ లక్ష్యంగా పనిచేయాలి



కొడకండ్ల: మాట్లాడుతున్న సురేష్‌నాయక్



ఘన్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు



రఘునాథపల్లిలో..



చిల్పూరు: నష్కల్‌లో..

కొడకండ్ల: గడిచిన అసెంబ్లీ ఎన్నికల కంటే రెట్టింపు స్థాయిలో కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు భారీ మెజార్టీ దక్కేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేసిన పథకాలతో పాటు త్వరలో చేపట్టబోయే పథకాలను వివరించి ఓటర్ల అభిమానాన్ని చూరగొనాలని, తొర్రూరు డిపోకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిల చొరవతో 20 అదనపు బస్సులు ఇవ్వాలన్న కోరికకు స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ 10 బస్సులను మంజూరు ఇచ్చినందుకు మంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, మండల ఇన్‌చార్జ్ గంజి ప్రసాద్‌రెడ్డి, రవిందర్, అబ్దుల్లా, రమేష్, శ్రీకాంత్, శ్రీవర్థ, భిక్షపతి పాల్గొన్నారు.

కడియం కావ్యను గెలిపించండి

చిల్పూరు: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ వరంగల్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీటీసీ పాశం శిరీషసురేష్, పార్టీ జిల్లా నాయకుడు వంగాల జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. నష్కల్ గ్రామంలో గురువారం నమూనా ఈవీఎంలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కరకంటి స్వప్నవెంకటేష్, కూరపాటి సాంబయ్య, భిక్షపతి, రాజిరెడ్డి, చిర్ర శంకర్, రాంబాబు, శ్యాంసుందర్, మణి, యాదగిరి, స్వప్న ఉన్నారు.

ఇంటింటా ప్రచారం

జఫర్‌గఢ్: కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు అన్నెబోయిన భిక్షపతి, కుల్లా మోహన్‌రావు, జ్యోతి యాకయ్య, మొగిళిపాక నర్సింగం, నంచర్ల యాదగిరి, పట్టపూరి విజయ్, ఉల్లి శివరాజు, కుక్కల ఎల్లయ్య పాల్గొన్నారు. అలాగే మండలంలో ఇండియా కూటమి అభ్యర్థి కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మండల కార్యదర్శి జువారి రమేశ్ కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ ద్వారానే నిరుపేదలు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి సాధ్యమని పార్టీ జిల్లా నాయకుడు కొలిపాక సతీష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేతిగుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్టేషన్‌ఘన్‌పూర్‌లో గురువారం విస్తృత ప్రచారం చేశారు. నాయకులు పెసరు సారయ్య, జీడి రమేష్, గట్టు రమేష్, పొన్న శ్రీనివాస్, అరుణ్‌లాల్, శరత్, సురేందర్, శివ, ఖలీమ్, రఘు, ఏలియా, కరుణాకర్, రియాజ్, కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

రఘునాథపల్లి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీటీసీ బొల్లం అజయ్, మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబులు పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో చేతి గుర్తుకు ఓటు వేయాలని కాంగ్రెస్ నాయకులతో కలిసి నమూనా ఈవీఎంలతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గాదె మహేందర్‌రెడ్డి, నీలం యువరాజ్, పేర్ని రవి, ఎండీ బాషుమియా, ఇబ్రహీంపాషా తదితరులు పాల్గొన్నారు. అదే విదంగా కావ్యకు మద్దతుగా సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు.

పాలకుర్తి: కావ్యను గెలిపించాలని మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పాలకుర్తి మాజీ సర్పంచ్ కమ్మగాని ఆంజనేయు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన టెక్నోజిల్ సంబురాలు



టెక్నోజిల్-24 ను ప్రారంభిస్తున్న విజయపాల్‌రెడ్డి





విద్యార్థినుల టెక్నోజిల్ సంబురాలు



వేడుకల్లో విద్యార్థినులు, అధ్యాపకులు

జనగామ: జనగామ మండలం యశ్వంతాపూర్ శ్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో టెక్నోజిల్–24 సంబురాలు అంబరాన్నంటాయి. కళాశాల డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండో రోజు మన సంస్కృతీ, సంప్రదాయాలు చాటుతూ విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు మంత్ర ముగ్ధుల్ని చేశాయి. ఫేస్ పెయింటింగ్, రంగోళి, స్లో బైక్, రైసింగ్, మెహందీ, గల్లీ క్రికెట్, ఆర్ట్ కాంపిటీషన్, ట్రెజర్ హంట్, బిజినెస్ ఐడియాస్ తదితర కేటగిరీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. బిజినెస్ ఐడియాలో భాగంగా విద్యార్థులు తెలంగాణ రుచులతో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెట్ స్టాల్స్ ఆకట్టుకున్నాయి. అనంతరం టెక్నోజిల్–24 కన్వీనర్ కర్ణాకర్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంస పత్రం అందించారు.

సంక్షిప్త సమాచారం

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటాలి

బచ్చన్నపేట: ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చూపించాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ గెలుపు కోసం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ తీరుతో రాష్ట్ర ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఆచరణకు సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెడుతుందని అన్నారు.

నేడు కార్నర్ సమావేశం

మండల కేంద్రంలో భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ నేడు (శుక్రవారం) కార్నర్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తునట్లు రమణారెడ్డి తెలిపారు. సాయంత్రం 6 గంటలకు మండలంలోని గోపాల్‌నగర్ నుంచి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం సమావేశం ఉంటుందన్నారు. అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కొండి వెంకట్‌రెడ్డి, ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, దస్తగిరి, సిద్దిరాంరెడ్డి, అజీమ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

దేవరుప్పుల: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ప్రశాంతతకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని లక్ష్మణ్‌తండా గ్రామ పంచాయతీ పరిధి బీఆర్‌తండా, కామారెడ్డిగూడెంలోని పోలీంగ్ కేంద్రాలను ఆయన పరిశీలించిన అనంతరం ఓటర్లతో మాట్లాడారు. ఎస్సై ఎస్ చెన్న కేశవులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు పెంపు

పాలకుర్తి: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువునుఈనెల 10వ తేదీ వరకు గడువు పెంచారని తహసీల్దార్ వెంకన్న గురువారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.

నివాళి

కొడకండ్ల: గుండెపోటుతో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన రాపోలు మురళీ అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులతో పాటు ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు, బంధు, మిత్రులు అధిక సంఖ్యలో హాజరై మురళీని కడసారి వీక్షించి కన్నీటి వీడ్కోలు పలికారు. ఎన్‌ఎస్‌యూఐ జనగామ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభిగౌడ్ హాజరై మురళీ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చి సంతాపాన్ని తెలిపారు. కన్నీటి పర్యంతమైన మురళీ భార్య, కుమారుడు, కుమార్తెను స్థానికులు ఓదార్చారు.

సంతాపం

దేవరుప్పుల: మండలంలోని కడవెండికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రేషపల్లి నర్సయ్య (75) మృతి చెందాడు. కాగా పార్టీ నాయకులు ఆయన మృతదేహంపై పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నర్సయ్య మృతిపట్ల మాజీ మంత్రి దయాకర్‌రావు ఫోన్‌లో ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తాటిపేల్లి మహేష్, ఎంపీటీసీ దుబ్బాక కవిత రత్నాకర్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు మజార్ పాషా, అధికార ప్రతినిధి హన్మంతు, ఎరువ రఫేల్‌రెడ్డి, మైనాల బక్కాజీ, కిష్టయ్య, మునగాల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

పరామర్శ

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు చిర్ర వెంకటేశ్వర్లు గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, గురువారం పార్టీ మండల అధ్యక్షుడు గంటి ఉపేందర్ యాదవ్, ఇల్లందుల సుదర్శన్ ఆస్పత్రికి వెళ్లి వెంకటేశ్వర్లును పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. డాక్టర్ చిర్ర సుమన్‌గౌడ్ ఉన్నారు.

'బుర్రలేని మాటలు తగదు'



మాట్లాడుతున్న భవానిరెడ్డి

జనగామ: భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ బుర్రలేని మాటలు మాట్లాడటం తగదని నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కర్త భవానిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో గురువారం ఉదయం మున్సిపల్ మాజీ చైర్మన్ వేమెళ్ల సత్యనారాయణరెడ్డితో కలిసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి తరపున ప్రచారం నిర్వహించారు. అనంతరం భవానిరెడ్డి మాట్లాడుతూ బూర ఓటమి ఖాయం కావడంతోనే మతిలేని మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి మెనిఫెస్టో ఉండదని, కేవలం మతోన్మాదం పేరు చెబుతూ పబ్బం గడపుతున్నారన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి గెలిస్తే జనగామ నియోజక వర్గం మరింతం అభివృద్ధి చెందుతుందన్నారు. డాక్టర్ రాజమౌళి, మండల శ్రీరాములు, వేముల బాల్‌రాజు, మోర్తాల ప్రభాక ర్, కళ్యాణం చంద్రమౌళి, ఉడుత రవి ఉన్నారు.

ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టండి



ప్రచారం చేస్తున్న వెంకటేష్

బచ్చన్నపేట: ప్రజా సమస్యలపై పోరాడి, ప్రశ్నించే గొంతుకకు పార్లమెంట్ ఎన్నికల్లో పట్టం కట్టాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ కోరారు. గురువారం మండలంలోని లింగంపల్లి, మన్సాన్‌పల్లి, పడమటికేశ్వాపూర్, సాల్వాపూర్ గ్రామాల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థిగా జహంగీర్‌కు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. రాములు, వెంకటమ్మ, బాల్‌నారాయణ, రాజమ్మ, జయమ్మ, బాల్‌రాజు, పోచయ్య, సులోచన తదితరుల పాల్గొన్నారు.

'ఓటమి భయంతోనే మోదీ వ్యాఖ్యలు'



మాట్లాడుతున్న వెంకటస్వామి


స్టేషన్‌ఘన్‌పూర్: సర్వేలన్నీ కాంగ్రెస్‌కు అనుకూలంగా వస్తుండగా ఓటమి భయంతోనే ప్రధాని నరేంద్ర మోదీ హిందువులు, ముస్లింలు అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఏఐసీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఏ ప్రధాని మతాల ప్రస్తావన తీసుకురాలేదని, నరేంద్రమోదీ మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కులగణన చేయకుండా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని, రాజ్యాంగాన్ని మారుస్తామంటున్నారన్నారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, హస్తినపురి హస్తగతం కావడం ఖాయమన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, టీపీసీసీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ చేపూరి వినోద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కేశిరెడ్డి లక్ష్మారెడ్డి ఉన్నారు.

తమ్ముడిని కాపాడేందుకు అక్క నిరాహార దీక్ష



జనగామ రూరల్: ఆస్తి కోసం తమ్ముడిని దాచారని.. అతడిని కాపాడాలని అక్క నిరాహార దీక్ష చేపట్టిన సంఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. డి. సత్యవతి బాధితుడి అక్క తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గుండ్లగడ్డకు చెందిన యర్రమల్ల అంజయ్యకు ఆరుగురు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వీరిలో రాంబాబుకు మతిస్థిమితం లేదు. కాగా, కుటుంబ సభ్యులకు తండ్రి అంజయ్య వ్యాపారంలో భాగం ఇవ్వగా రాంబాబుకు ఇవ్వలేదు. 130 గజాల ఇల్లు అతని పేర వీలునామా రాసి ఉంది. అయితే 16 ఏళ్ల నుంచి రాంబాబును పట్టించుకోలేదని, మతి స్థితిమితం లేకపోవడంతో వదిలేశారు. మూడు నెలల నుంచి సత్యవతి తమ్ముడి ఆరోగ్య, బాధ్యతలు చూసుకుంటోంది. అయితే లక్ష్మీనారాయణ తన సోదరుడు ఇంటిని కలుపోపుకొని ఇంటి నుంచి కొట్టి గెంటివేశారని సత్యవతి ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసులను ఆశ్రయిస్తే ఫలితం లేదని డీసీపీ తమకు న్యాయం చేయాలని గురువారం గుండ్ల గడ్డ రోడ్డుపై ఫ్లెక్సీతో నిరాహార దీక్ష చేపట్టింది. న్యాయం చేసి తన తమ్ముడు రాంబాబును విడిపించాలని వేడుకుంటుంది.

నేడు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం



పాలకుర్తి టౌన్: నేడు(శుక్రవారం) నియోజవర్గ స్థాయి సమావేశం పాలకుర్తిలో నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద కుమార్ తెలిపారు. గురువారం చెరుపల్లి యాదగిరి స్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు నిర్వహించే నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారని తెలిపారు. శివంగార్డెన్స్‌లో నిర్వహించే సమావేశానికి కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని కోరారు.రవి, కలిగట్ల విజయ, ఆగిరి, నరేష్, శ్రీను పాల్గొన్నారు.

నియామకం

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ అనుబంధ వీవర్స్ సెల్ మండల అధ్యక్షుడిగా ధర్మగడ్డతండాకు చెందిన నల్ల యాదగిరి నియమకమైనట్లు ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు సామల పరమేశ్వర్ తెలిపారు. జనగామలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ వీవర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ చేతుల మీదుగా నియమాక పత్రాన్ని అందుకున్నారు.

బీజేపీలో చేరిక

రఘునాథపల్లి: మండలంలోని ఫతేషాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ సమక్షంలో బీజేపీలో చేరారు. గురువారం హనుమకొండలో పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, యామంకి కొమురెల్లి, తూడి మహేష్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎన్నికల్లో తనను గెలిపించేందుకు కృషి చేయాలని అరూరి తెలిపినట్లుగా వారు పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బచ్చన్నపేట: ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చడానికే చలివేంద్రాల ఏర్పాటు అని వాస్విక్ ఫౌండేషన్ సభ్యుడు ఆముదాల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. నూకల రమేష్‌రెడ్డి, నూకల నర్సిరెడ్డి, పిల్లి అంజనేయులు, గణేష్ పాల్గొన్నారు.

మోదీని మూడోసారి ప్రధాని చేయండి

బచ్చన్నపేట: బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి మూడోసారి నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిని చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. గురువారం మండల కేంద్రం నుంచి నాయకులు కార్యకర్తలు భారీ ర్యాలీని నిర్వహించి రాయగిరిలో నిర్వహించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమావేశానికి తరలివెళ్లారు. వాహనాలకు ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు.